క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



తిరుమలగిరిలో ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

మద్దిరాల : మండల పరిధిలోని చందుపట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం ఎమ్మెల్యే మందుల సామేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు తీకుల సుధాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొమ్ము వెంకన్న, కస్తూరి సతీష్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

డబ్ల్యూటీఓ నుంచి భారత్ వైదొలగాలి



మాట్లాడుతున్న మందారి డేవిడ్‌కుమార్

దురాజ్‌పల్లి : ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) నుంచి భారత్ వైదొలగాలని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. శనివారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 26న దోహాలో జరగబోయే చర్చల సందర్భంగా.. అదే తేదీన క్విట్ డబ్ల్యూటీఓ అనే నినాదంతో ఉద్యమిద్దాం అని అన్నారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, పోరడ్ల దశరథ, రహీం, నాగు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య జాతర ప్రారంభం



చీదెళ్లలో శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య విగ్రహాలను తీసుకొస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీతిరుపతమ్మగోపయ్య స్వాముల జాతర ప్రారంభమైంది. ఈ సందర్భంగా తంగెళ్లపల్లి పాండయ్యచారి ఇంట్లో నుంచి దేవతామూర్తుల విగ్రహాలను తీసుకొస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఎంపీటీసీ జూలకంటి వెంకట్‌రెడ్డి, గుర్రం అమృతారెడ్డి, దేశగాని రాజీవ్‌గాంధీ, గొట్టిపర్తి గోపయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నూతనకల్: మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌లో పని చేస్తూ ఆత్మహత్య చేసుకున్న పల్సరాజు నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం మండల పరిధిలోని చిల్పకుంట్ల ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో నవీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పానగల్లు వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న నవీన్‌కు సకాలంలో వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డట్లు వారు తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ. 20లక్షల ఆర్థికసాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ నాయకులు మొగుళ్ల గోపాల్, కూసు ఉప్పలయ్య, చంద్రయ్య, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మక్క-సారక్క జాతర

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని గాజులమల్కాపురం గ్రామంలో శ్రీ సమక్క-సారక్క జాతర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. జాతరలో భక్తులు దేవతామూర్తులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి బంగారం (బెల్లం) సమర్పించారు. శివలింగం, నాగుపాముల వద్ద భక్తులు కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సమక్క-సారక్క జాతర సందర్భంగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కోలాటం, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు ముగిశాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు అందజేయడంతో పాటు ఆలయ హుండీ లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నాతాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బండి ధనమ్మరామకృష్ణారెడ్డి తెలిపారు.



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

పల్లెలకు చేరని 'ప్రగతి రథం'

- ఆత్మకూరు మండలంలో ఒక్క గ్రామానికి కూడా రాని బస్సులు
- ప్రయాణికులకు ఆటోలే దిక్కు

ఆత్మకూర్(ఎస్) : సూర్యాపేట జిల్లా కేంద్రానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆత్మకూరు మండల కేంద్రం నేటికీ బస్సు సౌకర్యానికి నోచుకోలేదు. తెలంగాణ ఏర్పాటు అనంతరం జిల్లా కేంద్రం నుంచి ప్రతి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు సౌకర్యం కల్పించారు. దీంతో ఆత్మకూరు మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కలుగుతుందని మండల వాసులు సంతోషపడ్డారు. కానీ 10 సంవత్సరాలు అవుతున్నా మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కలగలేదు. మండల కేంద్రంతో పాటు మండలంలో ఏ ఒక్క గ్రామానికి కూడా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణాలు సాగించేవాళ్లు ఆటోలను ఆశ్రయించక తప్పడంలేదు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం (మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం) మండల మహిళలకు అందని ద్రాక్షలా మారింది.



మూడు జిల్లాల వారధిగా..

ఆత్మకూరు మండల కేంద్రం సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు వారధిగా ఉంటుంది. ఈ మండల ప్రజలు వైద్యం కోసం, అలాగే పత్తి, మిర్చి వ్యాపార రీత్యా ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్తుంటారు. మహబూబాబాద్ జిల్లా, బంగ్లా, కొరివి తదితర ప్రాంతాలకు వ్యాపారం కోసం ఇక్కడి నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. ఆత్మకూరు మండల కేంద్రం మీదుగా ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సూర్యాపేట నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రజల సౌకర్యం పెరగడంతోపాటు మండలం అభివృద్ధి చెందుతుందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టి మండల కేంద్రం మీదుగా బస్సుసౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ పథకాల్లో మండల వాసులకు భాగస్వామ్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



ఆత్మకూరు మండలంలోని గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఆటోల్లో ప్రయాణాలు సాగిస్తూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు మహాలక్ష్మి పథకాన్ని ఉపయోగించుకుంటున్నా మండల మహిళలు మాత్రం పథకానికి దూరంగా ఉండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

\- వత్సవాయి లలిత

కోర్టు నిర్మాణం చేపట్టాలని వినతి

తుంగతుర్తి : తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టు నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ శనివారం సూర్యాపేటలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధేకు తుంగతుర్తి బార్ అసోయేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తుంగతుర్తిలోని జూనియర్ సివిల్ కోర్టుకు రెగ్యులర్ జడ్జిని నియమించాలని కోరారు. కోర్టులో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లా కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి వినతి పత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

నరేంద్ర మోదీ విధానాలను ఖండించాలి



దిష్టి బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : ఢిల్లీలో రైతులపై కాల్పులు జరిపిన నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను ఖండించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. శనివారం స్థానిక కొత్త బస్టాండ్ దగ్గర నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. పంటలకు మద్దతు ధర చట్టాన్ని అమలు చేయాలని పంజాబ్, హర్యానా రైతులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే వారిపై భాష్పవాయువు, లబ్బర్ బుల్లెట్ల కాల్పులు జరపడం అన్యాయమని తెలిపారు. ఈ కాల్పుల్లో శుభకరణ్ సింగ్ అనే రైతు మరణించాడని, అతడి మరణానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సామా నర్సిరెడ్డి, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లె వెంకన్న, పీడీఎస్‌యూ నాయకులు పుల్లూరి సింహాద్రి, ప్రగతిశీల ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటే మురళి, హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు హరి ప్రసాద్, సైదులు, శేఖర్, వెంకన్న, లింగయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు లలిత కళా పోటీలు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం బజార్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాల భవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం లలిత కళల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు హమీద్ ఖాన్ మాట్లాడారు. విద్యార్థులు బాల్య దశ నుంచి విద్యతో పాటు లలిత కళలు, సాహిత్యం, ఆటలు, పలు అంశాలపై శిక్షణ పొందితే భవిష్యత్తుకు భరోసా ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి మాట్లాడారు. విద్యార్థులలో దాగిన నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల భవన్ పర్యవేక్షకురాలు బండి రాధాకృష్ణరెడ్డి, సిబ్బంది దాసరి ఎల్లయ్య, ఉమా, సత్యనారాయణ సింగ్, బండారు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న హమీద్‌ఖాన్ తదితరులు

నైపుణ్యం కలిగిన కబడ్డీ క్రీడాకారులను ఎంపిక చేయాలి

సూర్యాపేట రూరల్ : కబడ్డీ క్రీడలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించి జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని జాతీయ కబడ్డీ క్రీడాకారుడు రామసాని రమేష్‌నాయుడు అన్నారు. శనివారం స్థానిక జనగామ క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కబడ్డీ క్రీడాకారులను గుర్తించి జాతీయ కబడ్డీ జట్టుకు ఎంపిక చేయాలన్నారు. అదే విధంగా గతంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలో జాతీయ క్రీడల పోటీలు నిర్వహించారని, ఈ పోటీలకు రూ. 40లక్షలతో కబడ్డీ ఆడేందుకు మ్యాట్లు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. కానీ ఈ కబడ్డీ మ్యాట్లను కొంత మంది వ్యక్తులు తమ వద్ద ఉంచుకొని.. వాటిని హైదరాబాద్, మేడారంలో జరిగే కబడ్డీ క్రీడా పోటీలకు కిరాయిలకు ఇస్తున్నారని తెలిపారు. కలెక్టర్ నిధులతో కొనుగోలు చేసిన కబడ్డీ మ్యాట్లను తిరిగి జిల్లా క్రీడల కార్యాలయంలో అధికారులకు అప్పగించాలని ఆయన కోరారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం

చివ్వెంల : శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివ్వెంల మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో శనివారం స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీఅలివేలు మంగ సమేతంగా అత్యంత వైభవంగా కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రతిష్ఠ హోమం, గరుడ ముద్ద కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావతు వీరన్న నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ ముద్ద వెంకన్న, చంద్రశేఖర్ రెడ్డి, చింతమళ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

పోలీస్ స్టేషన్లకు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు



తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లో..

తుంగతుర్తి : ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శనివారం తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ సందర్భంగా ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్లు ప్రభాకర్‌రెడ్డి, నీలా రాణిలు మాట్లాడారు. తుంగతుర్తిలో ఇంటర్ పరీక్షలకు సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 890 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం ఈ ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు జి.శ్రీనివాస్, సీహెచ్ నరేందర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు వేముల బాలరాజు, జీహెచ్.లింగం తెలిపారు. ఇంటర్ పరీక్ష ప్రశ్నపత్రాలను శనివారం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి భద్రపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ స్కూల్, తిరుమల సహకార జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు రమేష్, అశోక్, హైగ్రవమూర్తి, సుధాకర్, భిక్షం పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవం

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని త్రివేణి హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులుగా, ఉపాధ్యాయులుగా, అధికారులుగా వేషధారణలో అలరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రిన్సిపల్ హరి అభినందనలు తెలిపారు.

తిరుమలగిరి : తొండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల, అధికారుల వేషధారణలతో అందరినీ అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, మల్లిఖార్జున్‌రావు, జానిబేగం పాల్గొన్నారు.

అర్వపల్లి : కాసర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వివిధ పాత్రలు పోషించారు. ప్రతిభ చూపిన వారికి హెచ్‌ఎం సోమయ్య బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు దబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ లింగంపల్లి రేణుక, ధనమ్మ, యల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : గుడితండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధుల, అధికారుల, ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోసుల వెంకన్న, ఉపాధ్యాయులు గన్న ప్రసాద్, అగన్‌వాడీ టీచర్ గుగులోతు రజిత, కార్యదర్శి సురేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట టౌన్ : వివిధ వేషధారణలతో విద్యార్థులు



తిరుమలగిరి : తొండ పాఠశాలలో..



అర్వపల్లి : కాసర్లపహాడ్ పాఠశాలలో..



తుంగతుర్తి : గుడితండాలోని పాఠశాలలో..

సుదర్శన లక్ష్మీనరసింహ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

చివ్వెంల : మాఘ పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలో శనివారం శ్రీ సుదర్శన నరసింహ హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ చెరుకుపల్లి కిరణ్‌కుమారచార్యులు, శ్రీకారచార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తూ హోమ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణ మోహన్, మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం సందర్భంగా జిల్లా న్యాయమూర్తులతో హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే



హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను మెమొంటోతో సత్కరిస్తున్న సూర్యాపేట బార్ అసోసియేషన్ సభ్యులు



జిల్లా కోర్టు ప్రాంగణంలో జ్యుడీషియల్ ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే



అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

నూతనకల్ : విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్ రెడ్డి అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలోని నాగార్జున ఒలింపియాడ్, నాగార్జున ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 32వ వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. విద్యార్థులను అధిక ఒత్తిడికి గురిచేయొద్దని, విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేపట్టాలని వారు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి, ఎస్‌ఐ జూకూరి సైదులు, ఎంఈఓ రాములు నాయక్, మహేశ్వరం వెంకటయ్య, దేవిరెడ్డి నర్సిరెడ్డి, బండారు లింగారెడ్డి, ఎన్నారై దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

నాగారం : టెన్త్ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యలమకంటి సోమన్న అన్నారు. శనివారం వర్ధమానుకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చల్ల తేజ సహకారంతో 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ యనాల ఇంద్రసేనారెడ్డి, వల్లాల భానుప్రకాశ్, జక్కలి నరేష్, బుర్ర సోమేష్, గంట నవీన్, ఉయ్యాల కర్ణాకర్, గంట మహేందర్, బుర్ర నరేష్, హరీష్, శ్రీకాంత్, గుడ్డేటి సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా ఎదుర్కోలు మహోత్సవం

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఎదుర్కోలు కార్యక్రమాన్ని శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైజంక్షన్‌లో ఆర్చి వద్ద ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని జరిపారు. స్వామి కల్యాణానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎదుర్కోలుకు ముందు భక్తులు కోలాటాలు, బోనాల ఊరేగింపుతో ఆలయానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులు వేల్పుల రమేష్, శిగ నసీర్ గౌడ్, సామ అభిషేక్‌రెడ్డి, తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, ధర్మకర్తలు లక్ష్మాజీ, సోమయ్య, కృష్ణమూర్తి, రేణుక, శేఖర్, మాజీ జెడ్పీటీసీలు గుడిపాటి నర్సయ్య, కొత్రపిడత అవిలయ్య, ఈఓ వై. శ్రీనివాస్‌రెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, బైరబోయిన సైదులు, మహరాజు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జీడి వీరస్వామి, పాలెల్లి సురేష్, గుయ్యాని బాబు, అమీనుద్దీన్ పాల్గొన్నారు.

ధ్వజారోహణం, దేవతాహ్వానం..

అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి ధ్వజారోహణం, దేవతాహ్వానం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భగవానుడి వాహనమైన గరుడ ఆళ్వారును కొత్త వస్త్రంపై చిత్రించి పూజాధికములు నిర్వహించారు. అనంతరం భేరి పూజ, దేవతాహ్వానం జరిపించారు. బ్రహ్మ సమక్షంలో జరిగే ఈ ఉత్సవాలకు ముల్లోకాలకు చెందిన దేవతలందరిని ఆహ్వానించడం, వచ్చిన దేవతలను ఇష్టమైన సంగీత ఆలాపణలతో సత్కరించి బస ఏర్పాటు చేయడం తదితర పర్వాలను పూర్తిచేశారు. చివరికి స్వామికి ఇష్టమైన పదార్థాలైన గరుడ ముద్దలను నైవేద్యంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, ధర్మకర్తలు లక్ష్మాజీ, కనుకు రేణుక, దిర్శనపు కృష్ణమూర్తి, మాజీ జెడ్పీటీసీ కొత్రపిడత అవిలయ్య, అర్చకులు విఖనసలక్ష్మీనర్సింహాచార్యులు, రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, యాజ్ఞికుడు మాధవాచార్యులు పాల్గొన్నారు.

అంతరాలయ ద్వారానికి ఇత్తడి తొడుగు..

శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి అంతరాలయ ప్రధాన ద్వారానికి దాతలు ఇత్తడి తొడుగును ఏర్పాటు చేశారు. సీతారాంపురం గ్రామానికి చెందిన గార్లపాటి విద్యాసాగర్‌రెడ్డి, పొన్నూరు లక్ష్మీకాంతరెడ్డి, డాక్టర్ కె. మధూకర్‌రెడ్డి, అనిరెడ్డి లక్ష్మీనర్సింహారెడ్డి-రేణుకలు సుమారు రూ. 3లక్షల వ్యయంతో అంతరాలయ ప్రధాన ద్వారానికి ఇత్తడి తొడుగును హైదరాబాద్‌కు చెందిన శిల్పి రాగి సోంబ్రహ్మచారిచే చేయించి బిగించారు. దీంతో ఆలయ ప్రధాన ద్వారానికి కొత్తకళ వచ్చింది. దాతలకు ఆలయ ఉత్సవ కమిటీ, ఆలయ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.



పట్టు వస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే సామేలు, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి



ఎదుర్కోలు వేడుకలో పాల్గొన్న భక్తులు